తెలంగాణ బడ్జెట్ రూ.3,04,965 కోట్లు

- ఆరు గ్యారెంటీలకు రూ.56,084కోట్లు
- రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు

బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టిబడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,04,965 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో పద్దును ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారెంటీలకు రూ.56,084కోట్లు ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూల ధన వ్యయం రూ.2,26,982 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.5,944 కోట్లుగా చూపారు.

ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, "తెలంగాణ ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం కట్టబెట్టారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నాం. కొందరు దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ప్రతి చర్యనూ నిందిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని ప్రజలకు నిరాశ మిగిల్చింది. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మెగా మాస్టర్ ప్లాన్ 2050 రూపొందించాం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నాం. చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. ప్రతి మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు ఏర్పాటు చేస్తాం. ఐకెపి కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తాం. ఆ బియ్యాన్ని ఎఫ్‌సిఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తాం. మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్‌టిసికి అద్దెకు 600 బస్సులు కేటాయిస్తాం. ఎస్‌సి ఉపకులాల వర్గీకరణ చట్టాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ. ఒఆర్‌ఆర్ ఫేజ్-2 నీటి సరఫరా ప్రాజెక్టు చివరి దశకు చేరుకుంది. ఫేజ్-2 ద్వారా హెచ్‌ఎండిఎలో విస్తరించిన ప్రాంతాలకు తాగునీరు అందిస్తాం. హైదరాబాద్‌లో సమగ్ర వరద నీటిపారుదల ప్రాజెక్టుకు రూ.5,942 కోట్లు కేటాయిస్తాం. దేశానికి తలమానికంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నాం. శ్రీశైలం- నాగార్జునసాగర్ రహదారుల మధ్య ఇది ఉంటుంది. 56 గ్రామాలు, 765 చదరపు కి.మీ విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీలో ఎఐ సిటీ, ఫార్మా హబ్, స్పోర్ట్స్ సిటీ, క్లీన్ ఎనర్జీ, ఇన్నోవేషన్ జోన్లు, మల్టీ మోడల్ కనెక్టివిటీ, ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉంటాయి. ఈ ప్రాజెక్టును ఎఫ్‌సీడీఏ పర్యవేక్షిస్తుంది" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అయితే, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు 14 సార్లు బడ్జెట్ రూపకల్పన చేసి రికార్డు సృష్టించారు. త్వరలో రిటైర్డ్ కానున్న ఆయనకు ఇదే చివరి బడ్జెట్.

ఈ బడ్జెట్‌లో వివిధ శాఖల కేటాయింపులు

1.వ్యవసాయ శాఖ రూ. 24,439
2.పశు సంవర్ధక శాఖ రూ. 1,674 కోట్లు
3.పౌరసరఫరాల శాఖ రూ.5,734 కోట్లు
4. విద్యాశాఖ రూ.23,108 కోట్లు
5. కార్మిక ఉపాధికల్పన కూ.900 కోట్లు
6. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి రూ.31,605 కోట్లు
7. మహిళా శిశు సంక్షేమం రూ.2,862 కోట్లు
8. షెడ్యూల్ కులాల సంక్షేమం రూ.40,234 కోట్లు
9. షెడ్యూల్ తెగల రూ.17,169 కోట్లు
10. వెనుకబడిన తరగతుల శాఖ రూ.11,405 కోట్లు
11.చేనేత రంగాని రూ.371 కోట్లు
12.మైనారిటీ సంక్షేమం రూ.3,591 కోట్లు
13.పరిశ్రమల శాఖ రూ.3,527 కోట్లు
14.ఐటీ శాఖ రూ.774 కోట్లు
15.విద్యుత్ శాఖ రూ.21,221 కోట్లు
16.వైద్య ఆరోగ్య శాఖ రూ.12,393 కోట్లు
17.మున్సిపల్‌పరిపాలనపట్టణాభివృద్ధిశాఖ రూ.17, 67 7 కోట్లు
18.నీటిపారుదల శాఖ రూ.23,373 కోట్లు
19.హెూం శాఖ రూ.10,188 కోట్లు
20.దేవాదాయ శాఖ రూ.190 కోట్లు
21.అడవులు పర్యావరణ శాఖ రూ.1,023 కోట్లు
22.క్రీడాశాఖ రూ.465 కోట్లు
23.పర్యాటకశాఖ రూ.775 కోట్లు
24.రోడ్లు భవనాలు శాఖ రూ.5,907 కోట్లు

మెక్‌డొనాల్డ్‌తో సర్కార్ ఒప్పందం

- హైదరాబాద్‌లో గ్లోబల్ కార్యాలయం ఏర్పాటు
- 2 వేల మందికి ఉపాది లభించే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికాకు చెందిన మల్టీ నేషనల్ కంపెనీ మెక్ డోనాల్డ్ తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకుంది.

సంస్థ విస్తరణలో భాగంగా ఇండియా గ్లోబల్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఫలితంగా రెండు వేల మందికి ఉపాది లభించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం అసెంబ్లీలోని తన ఛాంబర్లో మెక్ డొనాల్డ్ ఛైర్మన్ క్రిస్ కెంప్కెజెన్స్కీతో పాటు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. తమ రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని పలు రాష్ట్రాలు పోటీ పడుతున్న నేపథ్యంలో మెక్ డొనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకోవటం గర్వంగా ఉందని ఈ సందర్భంగా సిఎం అన్నారు. ప్రభుత్వం వైపున అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గత 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభిద్ధికి చేపట్టిన కార్యక్రమాలను కంపెనీ ప్రతినిధులకు సీఎం వివరించారు. సంస్థకు అవసరమైన ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. సంస్థకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతులు సమకూర్చేలా అవకాశం కల్పించాలని సీఎం కోరారు. ఈ ఒప్పందతో రైతుల ఆదాయం పెరడగంతో పాటు రాష్ట్ర వ్యవసాయ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో 38 మెక్‌డొనాల్డ్స్ అవుట్ లెట్లున్నాయని, వీటిని ప్రతి ఏడాది మూడు నుంచి నాలుగు కొత్త అవుట్ లెట్లను విస్తరించనున్నట్టు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆశలు నెరవేర్చే బడ్జెట్ : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజల ఆశలు నేరవేర్చే బడ్జెట్‌గా ఉందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ అప్పులపై ఆధారపడి రాష్ట్రాన్ని నడపడం సాధ్యం కాదన్నారు. కేంద్ర బడ్జెట్ విషయంలో సమ పంపిణీ లేదని చెప్పారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయటం ఈ బడ్జెట్‌తో సాధ్యం కాదన్నారు. వాటిని అమలు చేయాలంటే సుమారు రూ.ఐదు లక్షల కోట్ల బడ్జెట్ కావాలని చెప్పారు. ఉన్న దానిలో అధిక అంచనాతో బడ్జెట్ పెట్టకుండా, వాస్తవికంగా ఈ బడ్జెట్ పెట్టారని తెలిపారు. నీటి పారుదలకు బడ్జెట్ పెద్దగా పెంచలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేరుకు వేల కోట్ల రూపాయలు కావాలన్నారు. యంగ్ ఇండియా స్కూళ్లకు నాలుగేండ్లకు కలిపి పెట్టారా లేదా అనేది చూడాలన్నారు. విద్యా రంగానికి 7.5శాతం కేటాయించారనీ, విద్యా, వైద్య రంగానికి నిధులు పెంచాలనేది మేధావుల అభిప్రాయమని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వీటికి బడ్జెట్ కేటాయింపులు భారీగా ఉంటాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన వాటా కోసం కొట్లాడాలన్నారు. ఖర్చు లేకుండా ఆదాయ మార్గాలు ప్రభుత్వం చూసుకోవాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రస్తావన బడ్జెట్‌లో చెప్పలేదన్నారు. ప్రతి వర్గానికి పని భద్రత బడ్జెట్‌లో లేదన్నారు. చేదు, తీపి కలగలసిన బడ్జెట్ ఇదనీ, ఉగాది పచ్చడిలా ఉందని తెలిపారు.

రస్న 'రిచ్' ఆవిష్కరణ

హైదరాబాద్ : పానియాల ఉత్పత్తుల సంస్థ రస్న కొత్తగా 'రస్న రిచ్'ను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఇది కేవలం రుచిలోనే కాకుండా గాఢతలోనూ అత్యుత్తమమైన పౌడర్ కాంసంట్రేట్ అని పేర్కొంది. ప్రతి రూ.10 సాచెట్‌తో 3 గ్లాసుల పానీయం తయారు చేయవచ్చని రస్నా ఇంటర్నేషనల్ గ్రూప్ ఛైర్మన్ పీరుజు ఖంబట్టా పేర్కొన్నారు.

శంషాబాద్‌లో ఎక్యూఐ మానిటరింగ్ స్టేషన్

- ప్రారంభించిన స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రీమియం రియల్ ఎస్టేట్ కంపెనీ స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్స్ బుధవారం శంషాబాద్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ)ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో స్లోవేనియా రిపబ్లిక్ రాయబారి మాటేజా వోడెజా వోడెబ్ ఘోష్, జిహెచ్‌ఎంసి అధికారి వివిఎల్ సుభద్రా దేవి పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు సమాజ ప్రయోజనం కోసం గాలి నాణ్యతను పర్యవేక్షించే అంకితభావానికి నిదర్శనమని స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ వ్యవస్థాపకులు, ఎండి కీర్తి చిలుకూరి పేర్కొన్నారు. శంషాబాద్‌లోని ఉడ్స్‌లోని ఎక్యూఐ మానిటరింగ్ స్టేషన్ పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించడానికి తాము తీసుకుంటున్న అనేక చర్యలలో ఒకటన్నారు.

సిఎం చూస్తున్న శాఖకు నిధులేవి?

- జిఎంపిఎస్ ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి చూస్తున్న పశుసంవర్ధక శాఖకు తక్కువగా నిధులు కేటాయిస్తే రైజింగ్ తెలంగాణా ఎలా సాధ్యమవుతుందని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జిఎంపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న గొర్లకాపర్ల సంక్షేమానికి, జీవాల సంరక్షణకు ఏ మాత్రం సరిపోయే అవకాశం లేదని తెలిపారు. పశు సంవర్ధక శాఖకు బడ్జెట్‌లో కేవలం రూ.1,674 కోట్లు ప్రతిపాదించారని పేర్కొన్నారు. గతేడాది కంటే రూ. 65కోట్లు తగ్గించిందని తెలిపారు. ఈ మూడేండ్ల కాలాన్ని పరిశీస్తే మొత్తం బడ్జెట్ రూ. 60వేల కోట్లు పెంచగా, పశుసంవర్ధక శాఖకు మాత్రం రూ. 361 కోట్లు తగ్గించారని విమర్శించారు. కేటాయింపులే ఈ విధంగా ఉంటే నిధులు విడుదల చేసే నాటికి ఇంకా ఎన్ని కోతలు పెడుతారోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నిధుల్లో సింహభాగం ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల నిర్వహణకే ఎక్కువ మొత్తం ఖర్చవుతుందని తెలిపారు. ఇక మిగిలిన వాటిల్లో మామిడిపల్లిలో నిర్మితమవుతున్న పశు వైద్య టీకా ఉత్పత్తి కేంద్రం 100కోట్లు, మేలు జాతి పశువుల అభివృద్ధి కోసం కంసాన్‌పల్లిలో కొత్త ఫ్రోజెన్ సెమన్ బుల్ స్టేషన్ నిర్మాణానికి రూ. 21.06 కోట్లు, కొహెడలో ఎక్స్‌పోర్ట్ ఓరియెంటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రూ. 47 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. పాడిరైతుల ప్రోత్సహకానికి రూ. 4.20 కోట్లు, పశువుల ఆరోగ్య సంవరక్షణను గాలికొదిలేసి కేవలం రూ. 6.25 కోట్లుగా చూపారని తెలిపారు. గొర్రెల పెంపకందార్ల ఊసేలేదని పేర్కొన్నారు. గొర్రెల పెంపకందార్ల ఫెడరేషన్‌కు ఒక్క పైసా ఇవ్వలేదని విమర్శించారు. గొల్లకురుమ ఆత్మగౌరవ భవనాలకు ఒక్క రూపాయి కేటాయించలేదనీ, యాదవ కార్పొరేషన్‌కు రూ. 50 కోట్లు కేటాయించారనీ, అవి దేని ఖర్చు చేస్తారనే వివరణ లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి పశుసంవర్ధక శాఖకు నిధులు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు.

మల్లు స్వరాజ్యం జీవితం ఆదర్శనీయం : సిఐ

ఆమె స్ఫూర్తిని కొనసాగించేందుకే సేవా కార్యక్రమాలు : డా.మల్లు అరుణ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శనీయమని, ఆమె అందించిన పోరాట స్ఫూర్తిని, మానవతా విలువలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా నల్లగొండ వన్ టౌన్ సిఐ ఎ రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సత్యావతి ఆస్పత్రిలో ఆమె మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేద మహిళకు ఉచిత మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. అంతకు ముందు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం జీవితాంతం నిరుపేదల కోసం అభ్యున్నతి కోసం పరితపించారని గుర్తు చేశారు. ఆమె చరిత్రను మర్చిపోకుండా భవిష్యత్ తరాలకు అందించేందుకు ఆమె పేరుతో నిర్వహించే సేవా కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతి యేటా వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఉచిత మోకాలు మార్పిడి ఆపరేషన్ అభినయమన్నారు. డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం తన జీవితాన్ని అట్టడుగు వర్గాల కోసం ధారపోశారని, పేదల కోసం చివరి వరకు జీవించారని గుర్తు చేశారు. సత్యావతి ఆస్పత్రి సహకారంతో మిర్యాలగూడకు చెందిన కార్మిక సంఘం నేత నకిరేకంటి అంజయ్య సతీమణి మరియమ్మకు విజయవంతంగా మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ చేసినట్టు వెల్లడించారు.

మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిఐ, మల్లు అరుణ్ రెడ్డి తదితరులు

సత్యావతి ఆస్పత్రి ఎండి డాక్టర్ రాంమనోహర్ మాట్లాడుతూ.. స్వరాజ్యం స్ఫూర్తిగా ఎన్నో కార్యక్రమాలు ప్రతి సంవత్సరం చేయడం చాలా సంతోషకరమన్నారు. అందులో తమ ఆస్పత్రి భాగస్వామ్యం కావడం ఇంకా సంతోషంగా ఉన్నదని, తాము కూడా అనేక సేవా కార్యక్రమల్లో పాల్గొంటున్నామని చెప్పారు. ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతినెలా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య సేవలే కాకుండా విద్యార్థులకు కరాటే, ఉచిత కంప్యూటర్ శిక్షణ, మహిళలకు టైలరింగ్, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు పుచ్చకాయల నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ శంకర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ సంపద, సత్యావతి వైద్యశాల ఎండీ సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ శంకర్ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

దుమారం రేపిన రసమయి వ్యాఖ్యలు

- ఆయన ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం, ఉద్రిక్తత
- ముట్టడిని అడ్డుకున్న పోలీసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అనుచరులు సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల్లో అక్రమాలకు పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. దాంతో నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నారు. అక్రమాలపై కాంగ్రెస్ పక్షాన చర్చకు సిద్ధమని.. దమ్ముంటే చర్చకు రావాలని, లేనిపక్షంలో రసమయి ఫాంహౌస్‌ను ముట్టడిస్తామని జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు. దాంతో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నాకు పిలుపునివ్వడంతో నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు భారీగా చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ మధు అధ్వర్యంలో పోలీస్ బలగాలు మోహరించాయి. పలువురు రసమయి ఫాంహౌస్ ముట్టడికి యత్నించడంతో పోలీస్ బలగాలు కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ ఘటనపై మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హారీశ్ రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. రసమయి భద్రతకు రాష్ట్ర డీజీపీ, జిల్లా సీపీ పూర్తి బాధ్యత వహించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతమవ్వకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

తప్పులెత్తి చూపితే.. దాడికి పురమాయింపు: రసమయి బాలకిషన్

పేద ప్రజల వైద్య చికిత్స ఖర్చులకు అందించే సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేతలో బాధితులకందించకుండా ఎమ్మెల్యే అనుచరులు పాల్పడిన అక్రమాలను ఎత్తిచూపితే.. తన నివాసంపై దాడులకు ఎమ్మెల్యే పురమాయించడం.. తనను గృహ నిర్బంధం చేయించడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఇల్లంతకుంటకు చెందిన కూనబోయిన రవి రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును రహీంఖాన్ పేటకు చెందిన కె.రవి, వల్లంపట్ల గ్రామానికి చెందిన లింగు శ్రీనివాస్ రూ.26 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బెజ్జంకి మండలంలోని గుండారం గ్రామానికి ఎల్.శ్రీనివాస్ తమ ఖాతాలో వేసుకున్నారని ఈ ఘటనలు వాస్తవాలన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు స్వాహా చేసేవారిపై చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగులకు మొండిచెయ్యి

- ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాల దగ్ధం

బడ్జెట్ పత్రాలను దగ్ధం చేస్తున్న ఎన్‌పిఆర్‌డి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వికలాంగులకు మొండి చెయ్యి చూపిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసి తమ నిరసనను వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని విమర్శించారు. వికలాంగుల వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్ పత్రాలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 2,26,982 కోట్ల రెవెన్యూ వ్యయం బడ్జెట్‌లో 2016 ఆర్‌పిడీ చట్టం ప్రకారం ఐదు శాతం అంటే రూ.11,349.1కోట్ల నిధులు కేటాయించాలని గుర్తు చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల అభివృద్ధి, సంక్షేమానికి పైసా కూడా కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో అంతర్భాగంగా వికలాంగుల సంక్షేమ శాఖను చూపి నిధులు కేటాయించటం లేదని తెలిపారు. ఇతర రంగాలకు నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం, 12 శాతం జనాభా ఉన్న వికలాంగుల సంక్షేమనికి నిధులేందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి ప్రత్యేకంగా వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలని, ఆసరా పింఛన్ల పెంపుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె చంద్రమోహన్, జె మల్లేష్, సుల్తాన్ రమేష్, నాయకులు జానీ, రాజు, శివకుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

కేఫ్ నీలోఫర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైటెక్ సిటీలో అతిపెద్ద 'కేఫ్ నీలోఫర్' ఏర్పాటు

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే అతిపెద్ద కేఫ్ 'కేఫ్ నీలోఫర్' ను హైటెక్ సిటీలోని రాయదుర్గంలో ఏర్పాటు చేసింది. బుధవారం దీనిని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభించారు. ఇది నగరంలో తమ సంస్థకు 9వ అవుట్‌టెల్ అని ఆ సంస్థ ఎండి అనుముల శశాంక్ తెలిపారు. ఇది 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేఫ్‌లో ఒకేసారి 700 మంది అతిథులు ఆతిథ్యం పొందవచ్చన్నారు. భారతీయులకు ప్రియమైన టీ, బన్ మస్కా, బిస్కెట్లు వివిధ వంటకాలకు ఈ కేఫ్ ప్రసిద్ధి చెందిందన్నారు. ఇప్పుడు మరింత విస్తృతమైన మెనూతో వచ్చిందన్నారు. తమ అవుట్‌లెట్ టీ పౌడర్, కుకీలు విక్రయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేఫ్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అనుముల బాబూ రావు తదితరులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్లు పెంచడం అభినందనీయం

- సిఎం రేవంత్ రెడ్డిని సన్మానించిన బిసి ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతానికి రిజర్వేషన్లు పెంచడం పట్ల బిసి ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యం.చంద్రశేఖర్ గౌడ్ ,ప్రధాన కార్యదర్శి రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ రామరాజు వర్మ, సలహాదారులు సుంకరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నారాయణ, యాదగిరి, సుంకరి కృష్ణ, శేషాచారి, దొంతి ప్రసన్న కుమార్, సీతారాం ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిలను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఇదొక చారిత్రాత్మకమైన ఘట్టంగా వారు వర్ణిస్తూ ఇదే నిర్ణయాన్ని దేశ వ్యాప్తంగా అమలు పరిచేలా వత్తిడి తేవాలని వారు కోరారు. ఇవే రిజర్వేషన్లను ఉద్యోగ, ఉపాధ్యాయ పదోన్నతుల్లో కుడా అమలు పరచాలని వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా బిసి ఉద్యోగుల సంఘం రూపొందించిన 2025 డైరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యారంగానికి నిరాశ

- స్వల్పంగా నిధులు పెరిగినా అవి సరిపోవు
- టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగలకు ఉద్యోగ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర నిరాశను మిగిల్చిందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) విమర్శించింది. మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.57 శాతం నిధులనే కేటాయించిందని తెలిపింది. గత బడ్జెట్ కంటే స్వల్పంగా రూ.1,816 కోట్ల నిధులు పెరిగినప్పటికీ విద్యారంగ బలోపేతానికి అవి సరిపోవని అభిప్రాయపడింది. ఈ మేరకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతం కంటే 0.2 శాతం నిధులు పెరిగాయని తెలిపారు. ఒకవైపు సాంకేతిక విద్య, ఉన్నత విద్యారంగాలను బలోపేతం చేస్తామంటూ మొత్తం విద్యారంగానికి కలిపి కేవలం 7.57 శాతం నిధులు కేటాయించడం శోచనీయమని విమర్శించారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టుగా విద్యారంగానికి 15 శాతం నిధుల కేటాయింపు అనే హామీకి ఆమడ దూరంలో ఉందని తెలిపారు. ఒకవైపు విద్యా కమిషన్‌ను నియమించి విద్యారంగంలో విప్లమాత్మక మార్పులు తీసుకొస్తామంటున్న పరిస్థితుల్లో అరకొర కేటాయింపులతో ఆ మార్పులు ఎలా సాధ్యమవుతాయనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన 12 ఏండ్లుగా రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందనేది వాస్తవమని పేర్కొన్నారు. మేధావులు, విద్యారంగ శ్రేయోభిలాషులు ప్రభుత్వ విద్యారంగా కేటాయింపుల పెంపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం ద్వారా విద్యారంగాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.11,600 కోట్లు కేటాయించిందని తెలిపారు. తద్వారా వాటిని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే కుట్రలో భాగమని విమర్శించారు. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26,067 పాఠశాలలను గాలికొదిలేసి, గురుకులాలు, సమీకృత గురుకులాల గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడుతున్నదని వివరించారు. గురుకులాలు ఈ రాష్ట్రంలో కేవలం ఐదు లక్షల మంది విద్యార్థులకు మాత్రమే విద్యనందిస్తున్నాయని వివరించారు. కానీ ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 20 లక్షల మంది పిల్లలు అభ్యసిస్తున్నారని తెలిపారు. వారి సంక్షేమం పట్ల సౌకర్యాల పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించకుండా అందరికీ సమానమైన విద్య అందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలోనే అంతరాలతో కూడిన విద్యా విధానం ఉండడం ఏమాత్రం భావ్యం కాదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రభుత్వ, గిరిజన సంక్షేమ పాఠశాలల అభివృద్ధికి నిధులను పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి : ఎస్‌టియుటిఎస్

గత బడ్జెట్ కన్నా విద్యారంగానికి స్వల్పంగా 0.2 శాతం నిధులు పెరిగాయని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ తెలిపారు. 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి రూ.11,600 కోట్లు కేటాయించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక సమీకృత గురుకుల పాఠశాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని తెలిపారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని కోరారు. గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు కామన్ డైట్ పథకాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించిందని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీకి అనుగుణంగా బడ్జెట్‌లో 15 శాతం నిధులను కేటాయించ లేదని తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ఆరోపించారు.

విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో సరిపడా కేటాయింపుల్లేవని టిఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎండి అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాజిరెడ్డి తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులతో నిరాశపర్చిందని ఎస్‌జిటియు రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకటేశం విమర్శించారు

బడ్జెట్‌ను పున:సమీక్షించాలి

- విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణ రంగాలకు నిధులు పెంచాలి
- ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమానికి అధిక నిధులివ్వాలి
- లేకుంటే ఆందోళనలు, ఉద్యమాలు తప్పవు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌ను పున:సమీక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. విద్యావైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణ రంగాలకు నిధులను పెంచాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ సంక్షేమానికి అధిక నిధులను కేటాయించాలని సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన మ్యానిఫెస్టో అమలుకు, ప్రస్తుత ప్రతిపాదనలకు ఎలాంటి పొంతన లేదని విమర్శించారు. ప్రాజెక్టుల కోసం నిధుల కేటాయింపులు గతేడాది కేటాయించిన దానిలో సగం కూడా ఖర్చుపెట్టలేదని తెలిపారు. ఇప్పుడు కూడా అలాంటి పద్ధతిలోనే ప్రతిపాదనలున్నాయని వివరించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న పథకానికి నిధులు సరిపడా కేటాయించకుండా కేవలం రూ.నాలుగు వేల కోట్లు ప్రతిపాదించారని వివరించారు. దాదాపు 30 లక్షల కుటుంబాలు ఇండ్లు లేనివారు ఉంటే కేవలం 4.50 లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి ప్రతిపాదన పెట్టారని తెలిపారు. దీని వల్ల ఈ ఏడాది కూడా అమలు జరగని పరిస్థితి కనపడుతున్నదని పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామన్నారని గుర్తు చేశారు. 40 లక్షల మంది రాష్ట్రంలో ఉంటే కేవలం 5.50 లక్షల మందికే పరిమితం చేయడంతో వ్యవసాయ కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి గతంలో ఇచ్చినదానికి కూడా కోత పెట్టారని విమర్శించారు.

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఇచ్చిన నిధుల కేటాయిపుల్లో కామారెడ్డి బిసి డిక్లరేషన్, చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌కు సంబంధం లేకుండా ఈ కేటాయింపులున్నాయని జాన్‌వెస్లీ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామన్నారని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో ఆ ఊసే లేదని విమర్శించారు. కామారెడ్డిలో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామన్నారనీ, ఈ బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామన్నారని తెలిపారు. ఇప్పుడు కేవలం రూ.11,400 కోట్లు మాత్రమే కేటాయించారని వివరించారు. మైనార్టీ సంక్షేమానికి కేవలం రూ.మూడు వేల కోట్లకు పరిమితం చేశారని పేర్కొన్నారు. విద్యారంగానికి గతం కంటే 0.2 శాతం నిధులను పెంచారని తెలిపారు. విద్యారంగమంతా ప్రయివేటు పరమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అది ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనీ, బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని ఒకవైపు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తుంటే 7.57 శాతానికే పరిమితం చేశారని విమర్శించారు. ఆర్‌టిసి పరిరక్షణ కోసం, ఉద్యోగులుగా గుర్తిస్తూ, వారిని అభివృద్ధి చేసేదానికి చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. కానీ ఎలాంటి నిధుల కేటాయింపు లేదని పేర్కొన్నారు. అసంఘటిత రంగం, ఆశా, అంగన్‌వాడీల వేతనాల పెంపునకు ఎలాంటి ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు. పోడు భూములు సాగుచేసుకున్నవారికి పట్టాలిస్తామన్నారని గుర్తు చేశారు. గిరిజన గూడెం, తండాల అభివృద్ధికి రూ.25 లక్షలు ఇస్తామన్నారని తెలిపారు. ఈ బడ్జెట్‌లో ఆ ఊసేలేదని పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా పేదలకు 14 రకాల సరుకులను ఇచ్చేందుకు కేటాయింపుల్లేవని వివరించారు. ఈ విధంగా మొత్తం సంక్షేమ రంగంలో ఆరు గ్యారెంటీలు కూడా ఈ ఏడాది కూడా అమలు జరగబోదని తెలిపారు. కేవలం ప్రచారానికి పరిమితమయ్యే పద్ధతిలోనే ఈ బడ్జెట్ ఉందని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను పున:సమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా పోరాడాలని కోరారు. కీలక రంగాలు, సంక్షేమ రంగాలకు కేటాయించిన పద్దులను అవసరానికి అనుగుణంగా పెంచకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని తెలిపారు. ఉద్యమాలు, పోరాటాలు తప్పవని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పారిశ్రామిక రంగానికి స్వల్ప ఊరట

- రూ.3,527 కోట్లు కేటాయింపు
- గతేడాది కంటే పెరిగిన రూ.765 కోట్లు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈసారి వాణిజ్య, పరిశ్రమల రంగానికి బడ్జెట్ కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఈ రంగానికి రూ. 3,527 కోట్లను కేటాయించింది. గతేడాది (2024-25)లో రూ.2,762 కోట్లు కేటాయించగా, ఈ దఫా రూ.765కోట్లు పెరిగాయి.కేటాయింపుల్లోనే కొంత పెంచినా, ఖర్చు ఏమేరకు చేస్తారో చూడాలని పారిశ్రామక వర్గాలు అంటున్నాయి.. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఇ) పరిశ్రమలకు ఈ సారీ బడ్జెట్లో వరాల జల్లు కురిపిస్తారని భావించిన వారికి నిరాశే ఎదురైంది. గత ఏడేళ్లుగా రాయితీలు అందక ఈ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 2017 నుంచి వివిధ సబ్సిడీల రూపంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,500 కోట్లకు చేరుకున్నాయి. ఆరంభంలో అనుమతుల మంజూరు, వసతుల కల్పనలో వేగంగా స్పందించిన గత సర్కార్ అ తర్వాత పట్టించుకోలేదు. దానికి తోడు పారిశ్రామిక వికేంద్రీకరణ, రాయితీల విడుదలలో జాప్యం మూలంగా రాష్ట్రంలో దాదాపు 10 వేలకు పైగా పరిశ్రమలు మూత పడ్డాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ అంతటా పారిశ్రామికాభివృద్ధి జరగాలనే లక్ష్యంతో మెగా మాస్టర్ ప్లాన్-2050ని ప్రభుత్వం రూపొందించింది. ఒక్క చోటే కాకుండా రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలు, హైదరాబాద్ తరహాలోనే అభివృద్ధి చెందాలన్నది ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దావోస్ ఆర్థిక సదస్సులో దక్షిణాది రాష్ట్రాలతో పోటీ పడి ఈ ఏడాది రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పినా ఆ దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు.

ప్రవచనాలెక్కువ... పైసలు తక్కువ

- బడ్జెట్‌పై కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రవచాలను ఎక్కువ, పైసలు తక్కువ అన్నట్టుగా ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేశారు. బుధవారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. బడ్జెట్ ప్రసంగంలో కొత్తదేమీ లేదని, ప్రతిసారి చెప్పినవే తప్ప అందులో ఒక్క మాట నిజం లేదని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతిసారి ఏడాదికి రూ.లక్ష కోట్లు అప్పులు కడుతున్నామనీ, అప్పుల కారణంగానే అభివృద్ధి చేయలేకపోతున్నామని చెబుతున్న మాటలు అబద్ధమని స్పష్టమైందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై తప్పుడు ప్రచారం చేశారని మండి పడ్డారు. రూ.ఏడు లక్షల కోట్ల అప్పులు చేశారని ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ బుక్‌లో మాత్రం తెలంగాణ అప్పులు రూ. 4.37 లక్షల కోట్లుగా చూపించారని, ఇందులో రూ.లక్షా 58 వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు కూడా ఉన్నాయని తెలిపారు.

ఐటికి గతేడాది ఎంతుందో అంతే..

- రూ.774 కోట్లు ప్రతిపాదించిన సర్కార్
- లక్ష్యం బాగానే ఉన్నా కేటాయింపులే తక్కువ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ఈ సారి బడ్జెట్లో ఎలాంటి మార్పు లేకుండా గతేడాది కేటాయిపులే చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఈ రంగానికి రూ. 774 కోట్లు కేటాయించింది. గతేడాది (2024-25) ఈ రంగానికి ఇదే మొత్తం కేటాయించడం గమనార్హం. అయితే గతేడాది కేటాయింపుల్లో సగమైనా ఖర్చు చేయలేదని తెలుస్తోంది. ఈ సారి కేటాయింపులో ఏమేరకు వ్యయం చేస్తారో చూడాలని ఐటి వర్గాలంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)పై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు బడ్జెట్లో సర్కార్ పేర్కొంది. హైదరాబాద్‌ను ఈ రంగంలో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 200 ఎకరాల్లో ఎఐ సిటీని నిర్మిస్తామని సర్కార్ ప్రకటించింది. కృత్రిమ మేధ, బ్లాక్ చైన్ వంటి కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీలకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునిక ప్రక్రియల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి భట్టి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలోని మూరుమూల ప్రాంతాలకు కొత్తగా ఫైబర్ గ్రిడ్ అందుబాటులోకి తేవడం, సాంకేతికతను పల్లెలకు అందించడానికి రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నట్టు సర్కార్ వివరించింది. లక్ష్యం గొప్పగా ఉన్నప్పటికీ ఆ ధశగా కేటాయింపులు లేవని ఐటీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. గతేడాది కేటాయింపుల్లో సగం కూడా ఖర్చు చేయక పోవడమే ఆందుకు నిదర్శనమని ఆయా వర్గాలు వాపోతున్నాయి.

ప్రేమ పేరుతో వేధింపులతో బాలిక ఆత్మహత్య

- ఇద్దరు యువకులపై పోక్సో కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయడంతో ఓ బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో బుధవారం జరిగింది. ఎస్ఐ రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలం రాంభద్రునిపల్లి గ్రామానికి చెందిన బాలిక మండల కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివేది. అదే గ్రామానికి చెందిన బాస రాము, గొల్లపల్లి మండలంలోని రంగదామునిపల్లి గ్రామానికి చెందిన మరొక యువకుడు ప్రేమ పేరుతో బాలికను వేధించారు. ఒప్పుకోకపోతే పరువు తీస్తామని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపంతో బాలిక ఈనెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన తల్లి జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం బాలిక మృతిచెందింది. తల్లి ఫిర్యాదు మేరకు ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ రవి కిరణ్ తెలిపారు.

అంతర్రాష్ట్ర కిడ్నాప్ ముఠాల గుట్టురట్టు

- కూపీలాగితే డొంక కదిలింది
- 27 మంది నిందితుల అరెస్ట్
- ఇప్పటికి 16 మంది పిల్లలను రక్షించిన ఎస్ఓటి పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పసి పిల్లలను కిడ్నాప్ చేసి విక్రయిస్తున్న కేసులో కూపీ లాగితే డొంక కదిలింది. ఐదు అంతర్రాష్ట్ర ముఠాల గుట్టు రట్టయింది. పసిపిల్లలను విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను గతంలో రాచకొండ పరిధిలో ఎస్ఓటి పోలీసులు అరెస్టు చేసి ఆరుగురు శిశువులను రక్షించిన విషయం తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తును చైతన్యపురి పోలీసులు, ఎస్ఓటి పోలీసులు మరింత సమగ్రంగా విచారించడంతో ఐదు ముఠాల మాడుల్స్ బయటకు వచ్చాయి. ఈ క్రమంలో 27 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు తాజాగా 16 మంది పిల్లలను రక్షించారు. మిగిలిన తొమ్మిది మందిని కూడా రక్షించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బుధవారం ఎల్‌బినగర్‌లోని సిపి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్ఓటి డిసిపి ఎ రమణారెడ్డి, అదనపు డిసిపి ఎన్ నర్సింహారెడ్డితో కలిసి సిపి జి సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. మలక్‌పేట్‌లో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న సోము అమూల్య(ప్రధాన నిందితురాలు), గాంధీ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జంపల్లి కార్తీక్, నాగ్‌పూర్‌కు చెందిన వైషాలీ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపి

భీమ్రావ్ వాస్నిక్, చార్మినార్ వద్ద మ్యారేజ్ బ్యూరో నిర్వహిస్తున్న సజ్జన్ అగర్వాల్, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెంది వ్యాపారీ బనాల మంగయ్య, ఆసిఫాబాద్‌కు చెందిన వ్యాపారీ బోదను నాగరాజు, నేరేడ్‌మెట్‌కు చెందిన రామారాం అశోక్, మైలార్‌దేవ్‌పల్లికి చెందిన షేక్ ఇస్మాయిల్, నిజాంపేట్‌కు చెందిన మాచర్ల వంశీకృష్ణ ఒక ముఠాగా ఏర్పడ్డారు. అమూల్య ఆశా వర్కర్‌గా పనిచేస్తూనే ఆస్పత్రిలో పనిచేసే ఇస్మాయిల్ ద్వారా శిశువులను విక్రయించే రాకెట్‌లో చేరింది. మొదట ఆమె తెలిసిన దంపతులకు శిశువులను అందించగా, ఆ తర్వాత దీప్తి, కోల కృష్ణవేణి సహకారంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ముఠాలతో పరిచయం పెంచుకుంది. అమూల్య మొత్తం 18మంది శిశువులను అక్రమంగా విక్రయించింది. ఈ కేసుల్లో ఐదు ముఠాలకు చెందిన 27 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా సభ్యులు, క్రయవిక్రయాలు జరిపిన వారు ఇతర రాష్ట్రాల్లో ఉండటంతో మరింత సమగ్రంగా విచారిస్తున్నా మని సిపి తెలిపారు. సంచలనమైన కేసును ఛేదించడంతో ఎస్ఓటి పోలీసులతోపాటు చైతన్యపురి పోలీసులను సిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఓటి ఇన్‌స్పెక్టర్లు జి జంగయ్య, పి చంద్రశేఖర్‌రెడ్డి, డి ప్రవీణ్ బాబు, చైతన్యపురి ఎస్‌హెచ్ఒ జి వెంకటేశ్వరరావు, ఎస్ఐలు భద్రయ్య, వాసుదేవ్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. ఐదు నుంచి ఆరు లక్షలు

ఆడ శిశువులను రూ. రెండు నుంచి మూడు లక్షలకు కొనగోలు చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలు రూ. మూడు నుంచి నాలుగు లక్షల వరకు విక్రయిస్తున్నాయి. మగ శిశువులకైతే రూ. నాలుగు నుంచి ఐదు లక్షలు లేదా రూ. ఐదు నుంచి ఆరు లక్షల వరకు విక్రయిస్తున్నాయి.

చట్టప్రకారం దత్తత తీసుకోవాలి: సిపి

శిశువులను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు తప్పని సరిగా చట్టపరమైన విధానాలను పాటించాలని రాచకొండ సిపి సుధీర్‌బాబు తెలిపారు. దత్తత తీసుకునే అంశంలో డబ్బుల ప్రమేయం వస్తే అది ఖచ్చితంగా అక్రమమే అవుతుందన్నారు. పిల్లల దత్తత కోసం విక్రయించే ఏజెంట్లు, మిడిల్‌మెన్‌లను సంప్రదించకూడదని, చట్టప్రకారం దత్తత తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో దత్తత ఇచ్చేవారు, తీసుకునే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

వచ్చే వానాకాలం, యాసంగి సీజన్లకు 'రైతు భరోసా'

- బడ్జెట్‌లో రూ.18 వేల కోట్లు కేటాయింపు
- రుణమాఫీ కానీ రైతులకు నిరాశే
- వ్యవసాయానికి రూ.24,439 కోట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం పోయిన వానాకాలం సీజన్‌కు రైతుభరోసాను విస్మరించింది. యాసంగి సీజన్‌కు ప్రారంభించింది. ఇప్పటివరకు మూడెకరాల భూమి ఉన్న రైతులకు ప్రభుత్వం రైతు భరోసా నిధులు జమ చేసింది. కానీ యాసంగి ముగుస్తున్నా రైతు భరోసా ఇంకా పూర్తవ్వలేదు. కానీ 2025-26 వార్షిక బడ్జెట్‌లో మాత్రం రూ.18వేల కోట్లు కేటాయించి రైతులకు గుడ్‌న్యూస్ చెప్పింది. రైతులకు వచ్చే ఏడాదికి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనుంది. ఇవీ కాకుండా వ్యవసాయానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ 24,439 కోట్లు కేటాయించింది. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేవలం రూ.19,746 కోట్లు మాత్రమే వ్యవసాయ రంగానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. గతేడాదిలో పోల్చితే ఈసారి రూ.4,693 కోట్లు మాత్రమే అదనంగా కేటాయించింది. అయితే ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ కింద రూ.20,616.89 కోట్లను 25.35 లక్షల మంది రైతులకు చెల్లించింది. పెద్ద మొత్తంలో రుణమాఫీ చేసిన సర్కారు...వివిధ కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు ఈ బడ్జెట్ నిరాశే మిగిల్చింది. ఆ రైతుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. రైతులకు విత్తనాల సరఫరా, ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి, రైతువేదికల నిర్వాహణ, మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్, వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలకు, మైక్రో ఇరిగేషన్ తదితరాలకు కూడా నిధులు కేటాయించింది. గతేడాది పశువర్ధక శాఖ జీరో నిధులు కేటాయించిన సర్కారు...ఈసారి రూ.1,674 కేటాయించింది. అందులో ప్రధానంగా వెటర్నరీ బయోలాజికల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ నిర్మాణంలో కోసం రూ. 300 కోట్లు కేటాయించింది. దీంతో పశువులు వ్యాధుల బారిన పడకుండా నిరోధించే టీకాలను ఉత్పత్తి చేస్తుంది. కొహెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం రూ. 47 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నిధులను కేటాయించలేదు. మరోవైపు కూరగాయల సాగు రైతులను ప్రోత్సహిస్తామంటూ చెబుతున్న సర్కారు.. ఆ శాఖను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టలేదు.పామాయిల్ సాగును లక్షల ఎకరాలకు విస్తరించాలనే లక్ష్యానికి అనుగుణంగా కేటాయింపులు లేవు. కేవలం గతంలో ఇస్తున్న సబ్సిడీని కొనసాగిస్తామని పేర్కొంది. ఇప్పటికే పామాయిల్ గెలలకు సరైన ధర అందడం లేదంటున్న రైతులకు బడ్జెట్ నిరాశను కలిగిస్తున్నది. దిగుమతి సుంకాన్ని ఎత్తేసేందుకు కృషి చేస్తామని చెప్పింది. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే ఆ రైతులకు భరోసా కల్గించేలా బడ్జెట్ లేదు. అకాల వర్షాలకు ప్రతియేటా కొన్ని లక్షల ఎకరాల్లో పంట నష్టం జరుగుతున్నది. ఆ బాధల నుంచి రైతులను గట్టెక్కించేందుకు సర్కారు చర్యలు చేపట్టలేదు. పంటల బీమా అందకపోవడంతో రైతులు ఇప్పటికీ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

ఉస్మానియాలో నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలి

- కాంట్రాక్ట్ సిబ్బందిని టైమ్ స్కేల్ ఉద్యోగులుగా మార్చాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియాలో నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలనీ, కాంట్రాక్ట్ సిబ్బందిని టైమ్ స్కేల్ ఉద్యోగులుగా మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్ స్కేల్ డైలీవేజ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలనీ, రెండో పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న తలపెట్టిన చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమంలో పెద్దఎత్తున నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉన్నత విద్యా రంగాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు ప్రజాస్వామ్య వాతావరణానికి విఘాతం కలిగిస్తున్న తీరును ఎండగట్టారు. ఓయులోనూ ధర్నాలు, నిరసనలను రద్దు చేస్తూ వైస్ ఛాన్సలర్ విడుదల చేసిన జీఓను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి టి. మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పద్మశ్రీ, అమీర్, కోశాధికారి మహమ్మ ద్ సలార్, తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా ఉన్న సాగర్‌ను ఎండ బెట్టారు

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిండుకుండలా ఉన్న నాగార్జునసాగర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే ఎండ బెట్టిందని, దాని వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా, పెద్దవూర మండలం, పర్వేదుల గ్రామానికి చెందిన కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, బిఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు పల్లా మోహన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాల పంపిణీపై ప్రభుత్వం అశ్రద్ధగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఇక్కడ పంటలు ఎండుతుంటే.. సాగర్ నీటితో ప్రకాశం బ్యారేజీ కింద మాత్రం పంటలు పండిస్తున్నారన్నారు. వరద కాల్వ నీటి సరఫరాలో జాప్యం వల్ల పంటలు ఎండే పరిస్థితి ఉందన్నారు. బిఆర్ఎస్ పాలనలో సాగర్ ఆయకట్టు టెలాండ్ అనే పదం వినపడకుండా చేశామన్నారు. సాగర్‌లో దాదాపు 350 టిఎంసిల కేటాయింపు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఉండేదాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దక్కించుకోలేక పోయిందని విమర్శించారు. ఎడమ కాల్వ కింద పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సరైన రీతిలో స్పందించకపోవడంతో సాగర్ నీళ్లు ఆంధ్రాకు తరలిపోతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమవత్ రవీందర్‌కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు, నోముల భగత్, మాజీ ఎంపిపి చెన్ను అనురాధ సుందర్ రెడ్డి, అల్లి పెద్దిరాజు యాదవ్, సీనియర్ నాయకులు మేరెడ్డి జైపాల్‌రెడ్డి, దేవసాని శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇది సాదాసీదా బడ్జెట్

- విద్యారంగంలో మౌలిక మార్పు వచ్చేలా కేటాయింపుల్లేవ్
- సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గత బడ్జెట్‌ల తరహాలోనే 2025-26 బడ్జెట్ కూడా సాదాసీదాగా ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. విద్యారంగంలో మౌలిక మార్పు వచ్చేలా అనుకూల అంశాల్లేవనీ, అందుకోసం తగిన కేటాయింపుల్లేవని చెప్పారు. బుధవారం శాసనమండలి మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ ఆరేండ్లుగా బడ్జెట్ ప్రసంగాలు వింటున్నాననీ, ప్రసంగ పదాలు, వాక్యాలు ఎవరో ఒక్కరే రాసినట్టుగా ఉందని వివరించారు. సమ్మిళిత అభివృద్ధి, సామాజిక సంక్షేమం, అందరికీ సంక్షేమ ఫలాలు అందించడం వంటి పదాలున్నాయని అన్నారు. అప్పుల రాష్ట్రంగా కూరుకుపోయిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చెప్తున్నట్టుగానే బడ్జెట్ ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేకంగా కేటాయింపుల్లేవని చెప్పారు. 7.57 శాతం నిధులను కేటాయించిందని వివరించారు. రాష్ట్రంలో పాఠశాల విద్యారంగం ధ్వంసమైందన్నారు. దాన్ని ఎలా పునరుద్ధరిస్తారో ఎక్కడా చెప్పలేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెడితే ప్రాథమిక విద్య నిలబడుతుందని సూచించారు. ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి ఈ-కుబేర్‌లో పెండింగ్ బకాయిలున్నాయని చెప్పారు. వాటిని ఎప్పుడు, ఎంత కాలంలో చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ, పీఆర్సీని అమలు చేయాలని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో వాటి ప్రస్తావన ఎక్కడా లేదన్నారు. ప్రభుత్వ సమాధానంలో వాటి గురించి చెప్పాలని కోరారు.

కెసిఆర్ కనిపించడంలేదని పోలీసుకు ఫిర్యాదు చేస్తున్న అజార్

'కెసిఆర్ కనిపించడంలేదు వెతికిపెట్టండి' అంటూ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ సిఎం కెసిఆర్ కనిపించడంలేదని యూత్ కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు అజార్ ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అజార్ మాట్లాడుతూ.. మాజీ సిఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకపోవడమే కాక, అసెంబ్లీ సమావేశాలకూ హాజరు కావడం లేదని తెలిపారు. అదేవిధంగా కెసిఆర్ కనిపించడం లేదంటూ మర్కుక్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరగౌని శ్యాంప్రసాద్ గౌడ్ ప్రసాద్ అధ్వర్యంలో మర్కుక్ పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఇదిలాఉండగా, బిజెపి రాష్ట్ర నాయకులు జస్వంత్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ నాయకులు బండారి మహేశ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట 'వాంటెడ్ ఎమ్మెల్యే' బోర్డును అతికించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 119 నియోజకవర్గాల్లో అనాథ నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది గజ్వేల్ నియోజకవర్గం మాత్రమేనన్నారు.

స్పై కెమెరాల విక్రయాలపై ఆదేశాలివ్వలేం

- స్పష్టం చేసిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్పై కెమెరాల విక్రయాలపై కేంద్రానికి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని హైకోర్టు స్పష్టంచేసింది. స్పై కెమెరాల విక్రయాలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. "ఆన్‌లైన్, షాపుల్లో సులభంగా స్పై కెమెరాలు లభిస్తున్నాయి. ఇటీవల మహిళల వసతి గృహాల్లోని బాత్‌రూమ్‌లు, గదుల్లో ఇవి బయటపడ్డాయి. స్పై కెమెరాల విక్రయాలపై నియంత్రణ ఉండాలి" అని న్యాయవాది శ్రీరమ్య కోర్టును కోరారు. అవి దుర్వినియోగమైతే చర్యలు తీసుకునేలా చట్టాలున్నాయని కేంద్రం తరపు న్యాయవాది ముఖర్జీ కోర్టు దృష్టికి తెచ్చారు.

ప్రతి మొబైల్‌లోనూ కెమెరాలున్నాయని, వాటిని ఎలా నియంత్రించగలమని ఈ సందర్భంగా సిజె ప్రశ్నించారు. మొబైల్ కెమెరాలను గుర్తించే అవకాశం ఉందని, స్పై కెమెరాలను రహస్యంగా అమర్చుతున్నారని న్యాయవాది శ్రీరమ్య తెలిపారు. స్పై కెమెరాల విక్రయాలపై మార్గదర్శకాలు జారీ చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. స్పై కెమెరా.. నియంత్రణ విధించే వస్తువు కాదని కేంద్రం తరపు న్యాయవాది తెలిపారు. వీటి విక్రయాలపై ఆదేశాలివ్వలేమన్న హైకోర్టు.. పిటిషన్‌పై విచారణను ముగించింది.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మాదిగలను ముంచింది కాంగ్రెస్సే..

- మా పోరాట ఫలితమే వర్గీకరణ, సామాజిక న్యాయం : మంద కృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుడు.. ఇప్పుడు.. మాదిగలను ముంచింది కాంగ్రెస్సేనని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగలకు ఉద్యోగ అవకాశాలు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. అందులో భాగంగానే గతంలో ఉద్యోగ నోటిఫికేషన్‌లకు వర్గీకరణ అమలు చేస్తామని మోసం చేసిందన్నారు. ఈ కుట్రకు ప్రధాన సూత్రధారులు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్ రాజనర్సింహనే అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి స్పష్టమవుతోందన్నారు. మాల సామజిక తరగతి నాయకుల ఆధిపత్యానికి తలొగ్గి రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. మాదిగ మంత్రి అని చెప్పుకుంటున్న దామోదర రాజనర్సింహ సొంత మంత్రిత్వ శాఖలోనే ఉన్న వైద్య ఆరోగ్య శాఖలో సుప్రీం కోర్టు తీర్పు ఆగస్టులో వస్తే సెప్టెంబర్‌లో ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణ మాదిగ సామజిక తరగతి అమరుల త్యాగాలు, కార్యకర్తల కృషి వల్లే వచ్చిందని చెప్పారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో వర్గీకరణ విజయోత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత వర్గీకరణ జరిగిందన్నారు. ఈ చట్టం ఆమోదించడంలో ప్రధాని మోడీతో పాటు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక పాత్ర వహించారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు రాకపోతే ఇది సాధ్యమయ్యేది కాదన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ చాలా తోడ్పాటు అందించారని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, క్రాంతి దళ్ వ్యవస్థాపకాలు పృథ్వీరాజు యాదవ్, తెలంగాణ విఠల్, సీనియర్ జర్నలిస్ట్ ఇస్మాయిల్, ఎమ్మార్‌పిఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి మాదిగ, ఎంఎస్‌పి జాతీయ నాయకులు సొట్ట నరేంద్ర బాబు, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్ మాదిగ, రచయిత మచ్చ దేవేందర్ పాల్గొన్నారు.